క్లుప్తంగా...

15 నుంచి క్రీడాపోటీలు

కీసర: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో సీఎం కప్ పేరుతో మండల, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో క్రీడాపోటీలను నిర్వహిస్తోందని ఎంపీడీఓ లక్ష్మీవత్సలదేవి తెలిపారు. మండల స్థాయిలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు 15నుంచి 36 ఏళ్ల వయస్సు గల మహిళలు, పురుషులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు, ఆసక్తిగల యువత క్రీడాపోటీల్లో పాల్గొనాలనుకుంటే స్థానిక పంచాయతీ కార్యాలయంలో తమపేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

పోచారం: పోచారం రాజీవ్ సద్భావన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డికి సద్భావన ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మహిపతి శ్రీనివాస్‌రావు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. నీటి పైపుల లీకేజీలు, డ్రైనేజీ, విద్యుత్, లిఫ్ట్, వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు.

16వ వార్డులో కంటి వెలుగు ప్రారంభం



పరిశీలిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 16వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహరెడ్డి కౌన్సిలర్ ఉమానాగరాజుతో కలిసి ప్రారంభించారు. వార్డు ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందరూ విధిగా కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు కంటి అద్దాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతిభ, వైద్య సిబ్బంది రమేష్, సంధ్య, లతా, పూజ, బీఆర్ఎస్ నాయకులు ప్రకాష్‌రెడ్డి, కమురుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఉద్యోగం రాలేదన్న ఒత్తిడిలో ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం ఘట్‌కేసర్ పట్టణంలోని గీతా మందిర్ సమీపంలో ద్వారకానగర్‌కు చెందిన వరుణ్‌కుమార్, అలియాస్ హరికృష్ణ(23) నిరుద్యోగి. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఘట్‌కేసర్: జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలివీ... సికింద్రాబాద్‌కు చెందిన పెండిపోలే భవన్‌కుమార్(15) తన స్నేహితులు మనీశ్, గోపీచంద్‌తో కలిసి వారాసిగూడ నుంచి కారులో భువనగిరికి బయల్దేరారు. అవుషాపూర్ యాదాద్రి టిఫిన్ సెంటర్ సమీపంలోకి రాగానే కారును వేగంగా, నడపడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి వ్యతిరేక దిశలో వెళ్తున్న తూఫాన్, బెలీనో వాహనాలను ఢీకొట్టింది. దీంతో భవన్‌కుమార్ తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం ఉప్పల్‌లోని ఆదిత్య ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తడి పొడి చెత్తను వేరు చేసి అందించాలి

కీసర: గ్రామాల్లో ప్రజలు ప్రతిరోజూ తడి పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని కీసర మండల ఎంపీఓ నందకిషోర్ అన్నారు. శుక్రవారం కీసర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో గ్రామస్తులకు తడి పొడి చెత్తను వేరు చేసి అందజేసే విధానంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరు పంచాయతీలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయకపు మాధురి, ఉపసర్పంచ్ లక్ష్మణ్, సీసీలు, ఏపీఎం అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'టెక్'నాలెడ్జి వైపు..

- కార్పొరేట్‌కు దీటుగా పాఠశాల విద్య బలోపేతమే లక్ష్యం
- శివారు జిల్లాల్లో 1,454 ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు
- ఈ విద్యా సంవత్సరంలో అందజేసేందుకు ఏర్పాట్లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: కార్పొరేట్ విద్యకు దీటుగా సర్కారు విద్యను బలోపేతం చేసేందుకు మన ఊరు-మన బడి కార్యక్రమం కింద అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు వంటి పనులతో బడుల సుందరీకరణ చర్యలు చేపడుతున్న ప్రభుత్వం వాటిని మరింత ఆధునికరించే దిశగా ట్యాబ్‌ల పంపిణీతో ముందడుగు వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థులు.. కరోనా తదితర కారణాల నేపథ్యంలో కనీస సామర్థ్యాన్ని సాధించలేకపోయారని గుర్తించిన సర్కారు ఎఫ్ఎస్ఎన్ కార్యక్రమం కింద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ నేపథ్యంలోనే సర్కారు బడులకు ట్యాబ్‌లు పంపిణీ చేయటంతోపాటు ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వాటిని అందుబాటులోకి తేచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఎఫ్ఎస్ఎన్ కార్యక్రమం కింద తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన 19,800 ప్రాథమిక(పీఎస్), ప్రాథమికోన్నత పాఠశాల(యూపీఎస్)లకు విద్యార్థుల సంఖ్యను అనుసరించి ట్యాబ్‌లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 397, రంగారెడ్డి జిల్లాలో 1,057 ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేసే ప్రక్రియలో భాగంగా సంబంధిత విద్యాశాఖలకు వాటిని ఇప్పటికే చేరవేసింది.

బడుల సమాచారం ఇక జాగ్రత్త

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరాయి. అలాగే.. పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల ప్రవేశ రిజిష్టర్లు, రికార్డులు, మార్కుల వివరాలు, ఉపాధ్యాయుల సమాచారం అంతా రాతపూర్వకంగా ఉండటంతో.. కొంత కాలానికి అవసరమైన సమాచారం దొరక్కపోవచ్చనే అనుమానాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే విద్యార్థికి వచ్చిన మార్కులు, సహ పాఠ్యాంశ ప్రణాళిక అమలులో విద్యార్థి ప్రతిభ తదితర విషయాలు, విద్యార్థి ప్రవేశ సంఖ్య, పాఠశాల వదిలివెళ్లిన తేదీ తదితర వివరాలన్నీ ట్యాబ్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు తెలుస్తోంది. వీటి నిర్వహణ, సంరక్షణ బాధ్యత కూడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే మన ఊరు- మనబడి-మన బస్తీ కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడం, బోధనలో నూతనత్వాన్ని పరిచయం చేయడంతో విద్యార్థులు, సమాజం విశ్వాసాన్ని పొందాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇవి మరింత పూర్వ వైభవాన్ని సంతరించుకుంటాయనడంలో సందేహం అవసరం లేదని విద్యా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

పాఠశాల విద్యకు సంబంధించిన సమాచారాన్ని ప్రస్తుతం ఉపాధ్యాయులు తమ ఫోన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రధానోపాధ్యాయులు ట్యాబ్‌ల ద్వారా బడుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించటానికి అవకాశం ఉంటుంది. వీటి నిర్వహణ విషయంలో ఉపాధ్యాయులకు సంబంధిత నిపుణులతో శిక్షణ కూడా ఇప్పించారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మంత్రి చామకూర మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధితో పాటు పెండింగ్ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి, పెండింగ్ పనులపై మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, తహశీల్దార్లు, కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధులకు ఏమాత్రం కొరత లేదని చేపట్టాల్సిన పనులను సకాలంలో పూర్తి చేసేలా అవసరమైన ముందస్తు కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మేడ్చల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మొదటి స్థానంలో ఉందని, పురపాలక సంఘాల్లో జరుగుతున్న అభివృద్ధి, పెండింగ్ పనులపై మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలన్నారు.

నిధులను మంజూరు చేసేందుకు కృషి

పురపాలక సంఘాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రహదారులు, వెజ్- నాన్‌వెజ్ మార్కెట్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, దోబీఘాట్లు, స్టేడియం తదితర అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని తహశీల్దార్లు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్‌కు సంబంధించివి పెండింగ్‌లో ఉండకుండా చూడటంతోపాటు వాటిని ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందించాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించడానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సీఎం కప్- 2023 నిర్వహణపై పూర్తి స్థాయిలో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్లను మంత్రి ఆదేశించారు.

ఎంతో ఆనందంగా ఉంది: కలెక్టర్ అమయ్‌కుమార్

మేడ్చల్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం కూడా ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించడం, విజయవంతం కావడం ఎంతో ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. మేడ్చల్ అభివృద్ధిలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిందని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రజల అవసరాలను తీర్చేందుకు అధికార యంత్రాంగం నిరంతరం సహకరిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, పలువురు ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని పెండింగ్ సమస్యలను జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, వాటిని అప్పటికప్పుడే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీవో మల్లయ్య, ఆర్అండ్‌బీ అధికారి శ్రీనివాస్ మూర్తి, పీఆర్ ఈఈ రామ్మోహన్, డీపీఓ రమణమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మేయర్లు జక్కా వెంకట్‌రెడ్డి, మేకల కావ్య, బుచ్చిరెడ్డి, మున్సిపల్ చైర్మన్లు కొండల్‌రెడ్డి, చంద్రారెడ్డి, ప్రణీత, తహశీల్దార్లు గౌతమ్‌కుమార్, గౌరీ, విజయలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్లు వాణిరెడ్డి, స్వామినాయక్, సురేష్‌కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వరద సాఫీగా సాగేలా ఏర్పాట్లు

- వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు
- మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



నాగారంలో చెరువు వద్ద నాలా శుభ్రం చేసే పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని అన్నరాయిని చెరువు నుంచి చర్లపల్లి చెరువు వరకు గల నాలాలో చెత్త చెదారాన్ని తొలగించేందుకు ఇటాచీతో పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఈమేరకు నాగారం పెద్ద కప్పు వద్ద ఇటాచీతో నాలాను శుభ్రం చేసే పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న అకాల వర్షాల వల్ల ఇబ్బందులు ఏర్పడకుండా ఉండటంతో పాటు వర్షాకాలం ప్రారంభమయ్యే సరికి నాలాలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పనులు చేపడితే వర్షాలు కురిసిన సమయంలో వరద సాఫీగా వెళ్లేందుకు వీలుంటుందన్నారు. ఇందుకోసం మున్సిపల్ నిధులను వెచ్చించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు, డిప్యూటీ ఇంజినీర్ సుదర్శన్‌రాఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ఎన్విరాల్‌మెంటల్ ఇంజినీర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడండి



అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీ వై జంక్షన్ వద్ద కాలనీవాసుల ధర్నా

ఆర్‌జీకే కాలనీవాసుల ధర్నా

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకేకాలనీకి గతంలో ప్రభుత్వం కేటాయించిన 8 ఎకరాల శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆర్‌జీకే కాలనీ జేఏసీ నాయకులు, కాలనీవాసులు ఆర్‌జీకే వైజంక్షన్ వద్ద చెత్త లారీలను నిలిపేసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పోతరాజు రాములు తదితరులు మాట్లాడుతూ గతంలో ఆర్‌జీకే కాలనీలో నివాసం ఉంటున్న వారికోసం ఆర్‌జీకే కాలనీ వెనుకవైపు 8 ఎకరాల స్థలాన్ని శ్మశానవాటిక కోసం కేటాయించారని మంత్రి మల్లారెడ్డి, అధికారులు కూడా గతంలో శ్మశానవాటిక అభివృద్ధికి కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారన్నారు. తీరా ఇప్పుడు ఆర్‌జీకే కాలనీ సమీపంలో ఉన్న రాంకీ సంస్థ చెత్తడంపింగ్ యార్డులో ఏళ్ల క్రితం పోసిన చెత్తను ఇక్కడికి తరలించి డంప్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటిక స్థలంలో చెత్తను ఎలా డంప్ చేస్తారని రాంకీ సంస్థ ప్రతినిధులను ప్రశ్నిస్తే సదరు స్థలం చెత్త డంపింగ్ యార్డుదే అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 5 వేల మంది జనాభా ఉన్న ఆర్‌జీకే కాలనీకి శ్మశానవాటిక స్థలం లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. పాలకులు, జీహెచ్ఎంసీ అధికారులు, రాంకీ సంస్థ స్పందించాలని, లేదంటే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని అన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలనీవాసులతో చర్చించి ధర్నాను విరమింపజేశారు.

కీసర రామలింగేశ్వరస్వామి సేవలో..



కీసరగుట్ట స్వామి సేవలో కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ

కీసర: జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కీసర మండల ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, చీర్యాల లక్ష్మీనృసింహస్వామి, కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి సేవల్లో పాల్గొన్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం ఆలయ వేదపండితులు ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ దంపతులకు స్వామివార్ల ఆశీర్వచనంతోపాటు మహాప్రసాదాన్ని అందజేశారు.

ప్లాటులో ప్రభుత్వ భూమి అని బోర్డు ఎలా పాతారు?



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన ఉషారాణి

ఘట్‌కేసర్: మూడు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన ప్లాటులో ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఎలా పాతారని ప్లాటు యజమాని ఉషారాణి ప్రశ్నించారు. ఘనాపూర్ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆమె నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో సర్వే నంబర్ 1134లోని 57 ప్లాటును 1991 కొనుగోలు చేశానని, అప్పటి నుంచి కబ్జాలో ఉన్నానన్నారు. కొందరు రియల్టర్లు మా దగ్గరికొచ్చి ప్లాటు మాకే విక్రయించాలని, లేని పక్షంలో ప్లాట్లు మీకు చెందవని బెదిరిస్తున్నారని అన్నారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తానని, చట్టప్రకారం నడుచుకోవాలని సూచించారన్నారు.

నెల గడుస్తున్నా ధాన్యం కొనరేం..?

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ధాన్యం కుప్పను పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంకుషాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎంపీటీసీ శోభారాణితో కలిసి శుక్రవారం సందర్శించారు. ఎంపీపీ మాట్లాడుతూ నెల రోజులైనా ధాన్యం కుప్పల్లోనే ఉందని, నేటి వరకు తేమ శాతం పరిశీలించలేదని, టోకెన్లు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ ప్రకటనలకు చేతలకు పొంతన లేదని, ధాన్యం కొనుగోలుకే దిక్కులేదని, మొలకెత్తిన ధాన్యం కొంటామనడం సిగ్గుచేటన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు కంట కన్నీరు పెట్టించిన ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో అన్నదాతలు గుణపాఠం చెబుతారన్నారు. రైతులు దామోదర్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మర్పల్లిగూడ పంచాయతీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న మర్పల్లిగూడ పంచాయతీ కార్యాలయం భవనానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. సర్పంచ్ మంగమ్మ, ఎంపీటీసీ సరళకుమార్, ఉప సర్పంచ్ నరేశ్, పంచాయతీ సభ్యులు లత, మంజుల, సాయికుమార్, ఆనంద్, నాయకులు మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, మాజీ సర్పంచ్ సాయిలు, రవి, జంగయ్య పాల్గొన్నారు.

సీఎం కప్‌ను విజయవంతం చేయండి

మేడ్చల్: సీఎం కప్‌లో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, గ్రామాల కార్యదర్శులతో సీఎం కప్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల కార్యదర్శులకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 నుంచి 30ఏళ్ల లోపు వయస్సు ఉన్న యువత క్రీడల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఏంఈఓ వసంత, వైస్ ప్రెసిడెంట్ వెంకటేషం, ఎంపీఈ రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: జిల్లా కలెక్టర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆదేశానుసారం సీఎం కప్-2023 క్రీడలు విజయవంతం చేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రీడల నిర్వాహణపై ప్రజాప్రతినిధులు, జిల్లా క్రీడా కార్యదర్శి వినోద్‌కుమార్‌తో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలస్థాయిలో 15-36 ఏళ్ల వయస్సు గల వారికి అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 14లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ అరుణ, వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీఓ నందకిశోర్, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, శోభారాణి, నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, సర్పంచులు వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, శ్రీరాములు, యాదిలక్ష్మి, అనిత పాల్గొన్నారు.

మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలి



పైపులైన్ పనులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: పట్టణంలోని శివారెడ్డిగూడ సమీప కాలనీలకు మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం ఆరో వార్డులోని ట్యాంకు నుంచి ఏర్పాటు చేస్తున్న అదనపు పైపులైన్ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ అదనపు పైపులైన్ పనులు కొనసాగుతున్నందున మరో రెండు రోజుల వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు నీటిని సరఫరా చేయాలని కాంట్రాక్టర్, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, సిరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, మిషన్ భగీరథ మున్సిపాలిటీ ఇన్‌చార్జి దేవేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ప్రభోనంద ప్రశాంతినికేతన్‌లో ఫలితాలు భేష్



విశాల్ (485)



నిషిత్ (461)



వానిక (460)

ఘట్‌కేసర్: చదువుతో పాటు అన్ని రంగాల్లో విజ్ఞాన్ ప్రభోనంద ప్రశాంతినికేతన్ సీబీఎస్ఈ స్కూల్ దృష్టిసారించడంతో వంద శాతం ఫలితాలు సాధించామని ఆ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. సీబీఎస్ఈ ఫలితాల విడుదల అనంతరం మున్సిపాలిటీలోని కొండాపూర్ విజ్ఞాన్ ప్రభోనంద ప్రశాంతినికేతన్‌లో స్కూల్లో శుక్రవారం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ మా విద్యార్థి విశాల్ 485/500 మార్కులు, నిషిత్ 461/500, వానిక 460/500 సాధించారన్నారు.

మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్

శామీర్‌పేట: శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట వద్ద శుక్రవారం మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. డీసీఎంబీ హైదరాబాద్, బెంగళూరు విశ్వేశరాయ ఇండస్ట్రీయల్ అండ్ టెక్నలాజికల్(భారత ప్రభుత్వం) సంయుక్తంగా జీన్- హెల్త్ కనెక్ట్ పేరుతో కళాశాలలో మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. పలు రకాల జెన్యు మార్పులు, వంశపారంపర్య సంక్రమణల గురించి ఎగ్జిబిషన్‌లో వివరించారు. ఇలాంటి ఎగ్జిబిషన్‌ల ద్వారా మరింత విజ్ఞానాన్ని పొందుతున్నామని విద్యార్థినులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇస్రాత్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

